వైద్యులు నిబద్ధతతో పనిచేయాలి : కలెక్టర్

ప్రజాశక్తి-కడప అర్బన్

వైద్యులు నిబద్ధతతో పనిచేయాలని, ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కలెక్టర్ వి.విజయ్ రామరాజు సూచించారు. శనివారం కలెక్టరేట్ సభా భవన్‌లో ఆరోగ్యశ్రీ అనుబంధ ఆస్పత్రుల ప్రభుత్వ, ప్రయివేట్ వైద్యులు ,పట్టణ, గ్రామీణ ఆరోగ్య కేంద్రాల వైద్యులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష పథకాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకుందన్నారు. గుర్తించిన కుష్టు, క్షయ కేసులను వరుసగా ప్రతి నెలా మొదటి వారం పరీక్షలు నిర్వహించాలన్నారు. గుర్తించిన వాటికి వెంటనే మందులు అందించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డిసిహెచ్‌ఎస్ డాక్టర్ హిమదేవి, జిజి హెచ్ సూపరింటెండ్ డాక్టర్ రమాదేవి, డిసిసిసి ఆర్మర్ కో – ఆర్డినేటర్ డాక్టర్ సునీత, జిల్లా ఇమ్యు నైజేషన్ అధికారి డాక్టర్ ఉమా మహేశ్వర రావు, జిల్లా లెప్రోసీ అధికారి రవిబాబు, కడప, బద్వేల్, పులివెందుల, జమ్మలమడుగు డిప్యూటీ డిఎంహెచ్‌ఓలు పాల్గొన్నారు.

సృజనాత్మకతను వెలికి తీసేందుకే బాలోత్సవం

- చిత్రలేఖన పోటీలు విజయవంతం
- కన్వీనింగ్ కమిటీ సభ్యులు లక్ష్మిరాజా, రాజశేఖర్ రాహుల్

ప్రజాశక్తి-కడప అర్బన్

విద్యార్థుల్లో జీవితంలో టీపీ గుర్తులు మిగిల్చి కోటానికి, సృజనాత్మకతను వెలికి తీయటానికి కల్చరల్ ఆక్టివిటీస్‌లో ప్రావీణ్యతను చాటుకోవటానికి కడప బాలోత్సవం జిల్లాలో ఏర్పాటు చేశామని కన్వీనింగ్ కమిటీ సభ్యులు బి.లక్ష్మి రాజా, బి.రాజశేఖర్ రాహుల్ తెలిపారు. కడప బాలోత్సవం ద్వారా నిరంతరం విద్యార్థులకు మనసులను ఉత్తేజ పరచడానికి ఉపకరణం నిండటానికి కడప బాలోత్సవం పనిచేస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా చిత్రలేఖనం పోటీలు శనివారం ఎస్‌వి ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించారు. ఈ చిత్రలేఖనం పోటీలకు జిల్లా వ్యాప్తంగా విద్యార్థుల నుంచి అనూహ్యమైన స్పందన లభించింది. చిత్రలేఖనం పోటీలలో పలు ప్రభుత్వ ప్రయివేటు పాఠశాలల నుంచి 878 మంది విద్యార్థులు హాజరయ్యారని పేర్కొన్నారు. ఈ చిత్రలేఖనం పోటీలలో 3వ తరగతి నుంచి పదో తరగతి వరకు విద్యార్థులు భాగస్వాములయ్యారని చెప్పారు. విజేతలకు ఎస్‌వి ఇంజనీరింగ్ కళాశాలలో ఈనెల 14న బహుమతుల ప్రదానం ఉంటుందని తెలిపారు. విజేతలకు మెసేజ్ ద్వారా, ఫోన్ ద్వారా సమాచారం ఇస్తామని పేర్కొన్నారు. ఈ చిత్రలేఖనం పోటీలలో అధిక సంఖ్యలో పాల్గొన్న ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాల యాజమాన్యాలకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఎస్ఎ ప్రాజెక్ట్ ఆఫీసర్ అంబవరం ప్రభాకర్ రెడ్డి, సభ్యులు ప్రిన్సిపల్ ఎం సుధాకర్ రెడ్డి, బి.గోపాల్, నాగ మునిరెడ్డి, బాల ఎల్లారెడ్డి, మృత్యుంజయ శర్మ, కె. సురేష్ బాబు, ఎల్ఐసి రఘునాథరెడ్డి, కరీం, సునీత, అపర్ణ, ఉషా, తులసి, పాలెం మహేష్ బాబు, రవికుమార్, వెంకటేశ్వర్లు, శివరాం పాల్గొన్నారు. **కలసపాడు :** మండలంలోని స్థానిక సెయింట్ ఆంటోనీ ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాల బాలల దినోత్సవ సందర్భంగా ముందస్తు ఆటల పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ చిత్ర ప్రభావతి మాట్లాడుతూ, విద్యార్థులు చదువుతోపాటు ఆటపాటల్లో కూడా ప్రావీణ్యాన్ని సాధించి తల్లి దండ్రులకు మంచి పేరు తీసుకురావాలని అన్నారు.

కడప : జెవివి ఆధ్వర్యంలో నిర్వహించిన చిత్రలేఖనం పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

ఈ తరం యువతకు ఆదర్శం మౌలానా అబుల్ కలాం ఆజాద్

- కలెక్టర్ వి.విజయ్ రామరాజు

ప్రజాశక్తి - కడప అర్బన్

స్వాతంత్ర్య సమరయోధులు, భారత తొలి విద్యాశాఖ మంత్రి 'మౌలానా అబుల్ కలాం ఆజాద్' అసమాన విద్యావేత్తతో పాటు గొప్ప పరిపాలకుడని, ఈ తరం యువతకు ఆదర్శనీయుడని కలెక్టర్ వి.విజయ్ రామరాజు అన్నారు. శనివారం కలెక్టరేట్‌లోని స్పందన హాలులో మౌలానా అబుల్ కలాం ఆజాద్ 136 వ జయంతి వేడుకలను పురస్కరించుకొని అల్ప సంఖ్యాక వర్గాల సంక్షేమ దినోత్సవం, జాతీయ విద్యా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి కలెక్టర్ వి.విజయ్ రామరాజు ముఖ్య అతిథిగా హాజరై ఆయన చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్వాతంత్ర్య సంగ్రామంలో గాంధీ, నెహ్రూలతో చురుగ్గా మౌలానా అబుల్ కలాం పాల్గొన్నారని తెలిపారు. అరబిక్, పర్షియన్, ఉర్దూ, ఇంగ్లీష్ భాషల్లో ఆయన నిష్ణాతులని పేర్కొన్నారు. భారత విద్యావ్యవస్థలో అనేక సంస్కరణలు చేపట్టినందుకు గాను మొట్టమొదటి కేంద్ర విద్యాశాఖ మంత్రిగా నియమితులైనారు అన్నారు. మౌలానా అబుల్ కలాం ఆజాద్ ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, ఆయన జీవితాన్ని అందరూ ఆదర్శంగా తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. తల్లిదండ్రులు పిల్లలను మంచి ఆశయాలతో పెంచాలన్నారు. పిల్లలే రేపటి తరం భవిష్యత్తని.. అందరూ బాగా చదువుకోవాలని, గొప్పవారు కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి షేక్, ఇమ్రాన్, జిల్లా మైనార్టీ కార్పొరేషన్ ఇడి సంక్షేమ శాఖ అధికారి బ్రహ్మయ్య, కార్పొరేటర్లు షఫీ, అజ్మతుల్లా, ఆరిఫుల్లా, ఇతర కార్పొరేటర్లు, వైసిపి నాయకులు అఫ్జల్ ఖాన్, జిల్లా వక్ఫ్ బోర్డు ప్రెసిడెంట్ దస్తగిరి, జిల్లా వక్ఫ్ బోర్డు వైస్ ప్రెసిడెంట్ రీజ్వాన్,మైనార్టీ నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు. **ఆర్ట్స్ కళాశాలలో.. కడప :** జాతీయ విద్యా దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ పురుషుల కళాశాలలో శనివారం ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. తొలుత అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ జి. రవీంద్రనాథ్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్స్ పి. శివరామకృష్ణ, డాక్టర్ అంకాల నాగరాజు, ఉర్దూ అధ్యాపకులు వసీవుల్లా భక్తియారి, రాజశేఖర్ రెడ్డి, గయాస్, విద్యార్థులు పాల్గొన్నారు.

కలాం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కలెక్టర్

ముట్టుకుంటే పేలిపోతున్న టపాసులు

ధరలు నియంత్రించడంలో అధికారులు వైఫల్యం
కొనుగోలు చేయలేని సామాన్యులు

ప్రజాశక్తి- ఒంటిమిట్ట

మండల కేంద్రంలో ఏర్పాటుచేసిన బాణాసంచా దుకాణాల్లో టపాసులు పట్టుకుంటే పేలిపోతున్నాయని, వాటి ధరలు ఆకాశానంటుతున్నాయని, నియంత్రించడంలో అధికారులు విఫలం చెందారని ప్రజలు పేర్కొన్నారు. దుకాణదారులు ఇష్టారాజ్యంగా ధరలు నిర్ణయించి విక్రయిస్తున్నారు. అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని ఒక పక్కా చెబుతున్న అధికారుల హెచ్చరికలను వ్యాపారులు పెడచెవున పెట్టడం పై సర్వత్ర విమర్శలు వినిపిస్తున్నాయి. ధరలు నియంత్రించడంలో అధికారుల వైఫల్యం కొట్టొచ్చినట్టు కనబడుతుందని వినియోగదారులు వాపోతున్నారు. దీపావళి పండగ వచ్చిందంటే చిన్నారులు బాణాసంచా కాల్చేందుకు ఎంతగానో ఇష్టపడతారు. దీపావళి పండుగ సెలవులు మూడు రోజులు ఇవ్వడంతో ఎంతో ఉత్సాహంగా తల్లిదండ్రులు కొన్ని ఇస్తారని ఆశగా ఎదురుచూస్తారు. చిన్నారులకు టపాసులు కొనిస్తామని తల్లిదండ్రులు శనివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన దుకాణాల వద్దకు వెళ్లి ధరలు చూసి బెంబేలెత్తుతున్నారు. గతంలో పోల్చుకుంటే ఈ ఏడాది ధరలు సామాన్యుడు కొనలేని విధంగా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంత ధరలు ఎందుకు అమ్ముతున్నారని ప్రజల ప్రశ్నిస్తే తాత్కాలిక లైసెన్సులు తెచ్చుకునేందుకు ఒక్కో అంగడికి వేల రూపాయలు కుమ్మరించామని వ్యాపారులు బహిరంగంగా చెబుతున్నారు. టపాసుల అమ్మకాలలో ప్రతి ఏటా భారీ మొత్తంలో వ్యాపారులకు ఆదాయం వస్తూ ఉండడంతో కొందరు మాఫియాగా ఏర్పడి వ్యాపారంతో సంబంధం లేని వారు సైతం టపాసుల దుకాణాలు నిర్వహిం చేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఏది ఏమైనా ధరలు నియంత్రించడంలో అధికా రులు సంబంధిత యంత్రాగం వైఫల్యం చెందారని ప్రజలు చర్చించుకుంటున్నారు.

ఎక్కడ వేసిన గొంగళి అక్కడే

కడప అర్బన్ : ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి జిల్లా పర్యటన సందర్భంగా పలు అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభించారని, వాటికి ఏమైనా పురోగతి సాధించారా అంటే ఎక్కడ వేసిన గొంగళి అక్కడు అన్న చందంగా ఉందని టిడిపి పోలిట్ బ్యూరో సభ్యులు శ్రీనివాసరెడ్డి విమర్శించారు. శనివారం ఆయన నివాసంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పది శాసనసభ స్థానాలు ఇచ్చిన స్వంత జిల్లా పై శ్రద్ధ ఇదేనా అని ప్రశ్నించారు. ఇచ్చిన జీవోలకు దిక్కే లేదని తెలిపారు. కంపెనీ ప్రతినిధులతో శాలువాలు కప్పించుకోవడం తప్ప స్టీల్ ప్లాంట్ తెచ్చింది లేదని పేర్కొన్నారు. వై.ఎస్.రాజశేఖర్ రెడ్డి ప్రారంభించిన రైల్వే లైన్ వద్దని లేఖ రాసిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందని ఎద్దేవ చేశారు. ప్రజల ఆశలు, ఆకాంక్షలను నిరాశపరిచారని చెప్పారు. ఏనాడైనా అభివృద్ధి పై అధికారులతో చర్చించారా అని ప్రశ్నించారు. సిఎం గో బ్యాక్ అంటూ పులివెందుల ప్రజలే అంటున్నారంటే మీ పరిస్థితి ఏమిటో అర్థమవుతుందని తెలిపారు. సమావేశంలో టిడిపి నగర అధ్యక్షులు శివ కొండారెడ్డి పాల్గొన్నారు.

సాయినాథ్‌శర్మకు శుభాకాంక్షలు తెలియజేస్తున్న అభిమానులు

సాయినాథ్ శర్మకు సేవారత్న అవార్డు

ప్రజాశక్తి - చెన్నూరు

టిడిపి రాష్ట్ర మాజీ కార్యదర్శి, పుణ్యభూమి ఛారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కాశీబట్ల సాయినాథ్‌శర్మకు భారతదేశ నీతి అయోగ్ సోషల్ వెల్ఫేర్ మంత్రిత్వ శాఖ సంస్థ సేవా రత్న డాక్టరేట్ అవార్డును ప్రకటించింది. దీంతో ఆయన అభిమానులు హర్షం వ్యక్తం చేశారు. చెన్నూరుకు చెందిన తుపాకుల జనార్దన్ రెడ్డి, గురు మహేశ్వర్ రెడ్డి, రాజారెడ్డి, శివారెడ్డి మాట్లాడుతూ కరోనా కష్ట కాలం లో కాశీభట్ల సత్య సాయినాధశర్మ చేసిన సేవలు మరువలేనివని వారు తెలిపారు. ఆయన నిరంతరం ప్రజాసేవకే అంకితమై ఉన్నారన్నారు. సేవరత్న డాక్టరేట్‌కు ఎంపిక కావడం చాలా సంతోషకరమని చెప్పారు. శనివారం అనుచరులు, కార్యకర్తలు సాయినాథ్‌శర్మకు శుభాకాంక్షలు తెలి యజేశారు. కార్యక్రమంలో చెన్నూరు మండలానికి చెందిన తుపాకుల జనార్దన్ రెడ్డి, గురు మహేశ్వర్ రెడ్డి, వి. వీర శివారెడ్డి, రాజారెడ్డి, చెంగా బ్రహ్మయ్య పాల్గొన్నారు.

పేదలకు కూరగాయలు పంపిణీ

ప్రజాశక్తి - ఒంటిమిట్ట

మండల పరిధిలోని మలకాటపల్లి వద్ద మదరసాల అధినేత అబ్దుల్ సుభాన్ హిందూ, ముస్లిమ్ నిరుపేదలకు వృద్ధులకు, పిల్లలకు ,వికలాంగులకు ఒకొక్కరికి శనివారం రూ. 500 కూరగాయలు ఉచితంగా పంపిణీ చేసి తన మానవత్వాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ కరోనా నుంచి ప్రతినెలా రెండో శనివారం మానవ దృక్పథంతో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నానని చెప్పారు. చాలా మంది పేద విద్యార్థులకు ఉచిత విద్యను అందిస్తున్నామని తెలిపారు. ఆకలితో ఉన్న వారిని ఆదుకోవడం, నిస్సహాయులకు దానధర్మాలు చేయడం వల్ల సంతృప్తినిస్తుందని అన్నారు. అనేక రకాలైన వ్యా ధులకు ఆయుర్వేదం వైద్యం అందిస్తున్నామని, ఆస్పత్రికి వెళ్లి చూపిం చుకోలేని పేదలకు ఉచితంగా మందులు అందిస్తున్నామని చెప్పారు. కరోనా సమయంలోనూ కరోనా జబ్బుకు ఎన్నో ఉచితమైన మం దులు అందించామని, నిత్యావసర వంట సరుకులు అందించామని పేర్కొన్నారు. నేటి ప్రపంచంలో నేడు మానవాళికి శాంతి కరువైందని అశాంతితో ఎంతో ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. అందరూ సుఖ సంతోషాలతో జీవించాలని ఆకాక్షించారు. కార్యక్రమంలో పేదలు, వృద్ధులు, వికలాంగులు, పాల్గొన్నారు.

పేదలకు నగదు, కూరగాయలు పంపిణీ చేస్తున్న అబ్దుల్ సుభాన్

అన్నమాచార్య ఇంజినీరింగ్ కళాశాలలో ఫ్రెషర్స్ డే

ప్రజాశక్తి - చింతకొమ్మదిన్నె

స్థానిక అన్నమాచార్య ఇంజినీరింగ్ కళాశాలలో(అటానమస్) ఘనంగా ప్రెషర్స్‌డే నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఏ సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ తమ కళాశాలలో ర్యాగింగ్ అనేది అసలు ఉండదని, కళాశాల ఆవరణలో ప్రతి విద్యార్థిని సోదర భావంతో మెలగాలని, పాఠ్యపుస్తకాల ద్వారా, అధ్యాపకుల ద్వారా పొందిన విజ్ఞానాన్ని క్షేత్రస్థాయిలో ప్రయోగించి వాటి ఫలితాలను గమనించాలన్నారు, లక్ష్యాన్ని సాధించేందుకు విద్యార్థులు కృషి చేయాలన్నారు. విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యతోపాటు క్యాంపస్ సెలక్షన్ నిర్వహించడంలో కూడా ముందు న్నామన్నారు. విద్యార్థులు పట్టుదలతో ఇష్టపడి చదివి తల్లిదండ్రుల ఆశయాలు నెరవేర్చాలన్నారు, అనంతరం విద్యార్థిని విద్యార్థులు చేసిన పలు సాంస్కృతి కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి కార్యక్రమంలో అన్ని విబాగాధిపతులు అధ్యక్షులు, సిబ్బంది పాల్గొన్నారు.

కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రిన్సిపల్ సుధాకర్‌రెడ్డి

26న తహశీల్దారు ఘన కార్యాలపై సదస్సు

ప్రజాశక్తి - కడప అర్బన్

కడప తహశీల్దార్ శివరామిరెడ్డి ఘనకార్యాలపై ఈనెల 26న స్థానిక ప్రెస్‌క్లబ్‌లో సదస్సు నిర్వహించనున్నట్లు అఖిలపక్ష, ప్రజాసంఘాల నాయకులు పేర్కొన్నారు. శనివారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ సాధారణంగా అధికారులకు ఒక చోట మూడేళ్లు పనిచేసిన తరువాత బదిలీలుంటాయని, కానీ కానీ కడప తహశీల్దార్ మాత్రం ఐదేళ్లుగా బదిలీకి అతీతుడిగా కడపలో తిష్టవేశారని పేర్కొన్నారు. తహశీల్దారు చేసిన సేవలు, ఘనకార్యాలు కొన్ని చెప్పుకోవడం సాధ్యం కాదని, బాధితులే తమ జరిగిన నష్టాన్ని వివరిస్తారని తెలిపారు. ఎన్‌టిఆర్ నగర్ మొదులుకుని వడ్డెర కాలనీ, తిలక్‌నగర్, ఆర్.కె.నగర్, ఎస్ఆర్ నగర్, బుగ్గవంక ప్రాంతాలలో పేదలు, మధ్యతరగతి ప్రజలు నివశించే వందల ఇళ్లు , గునాదులు నిర్ధాక్షిణ్యంగా కూల్చివేసిన ఘనత ఉందన్నారు. బుగ్గవంక ఆక్రమించి నిర్మించిన ఎమ్మెల్యే సినిమాహాలుకు ఎలాంటి ముప్పు తలపెట్టక రక్షణ కవచంగా నిలిచి, చట్టబద్దంగా రక్షణ కల్పించారని పేర్కొన్నారు. ఇలా చెప్పుకుంటూ పోతే అనేకం ఉన్నాయని పేర్కొన్నారు. తహశీల్దారు నిబద్ధతపై నిర్వహించే సదస్సును జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో భూపోరాట సాధన కమిటీ జిల్లా కన్వీనర్ బి.నారా యణ, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.ఎ.సత్తార్, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బి.హరి ప్రసాద్, బిఎస్‌పి జిల్లా ఇన్‌ఛార్జి గురప్ప, సిపిఎం నగర కార్యదర్శి ఎ.రామమోహన్, హేతువాద సంఘం జిల్లా కార్యదర్శి సి.ఆర్.వి.ప్రసాద్ రావు, సిపిఐ నగర కార్యదర్శి వర్గ సభ్యులు ఓబయ్య, సీనియర్ జర్నలిస్టు ఆంజనేయులు, లోక్‌సత్తా జిల్లా అధ్యక్షులు దేవర కృష్ణ, సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసి డబ్ల్యూ రాము మాట్లాడారు.

గ్రంథాలయ వారోత్సవాల పోస్టర్లు ఆవిష్కరణ

ప్రజాశక్తి-పోరుమామిళ్ల

ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న గ్రంథాలయ వారోత్సవాలను విజయవంతం చేయాలని గ్రంథాలయ అధికారి ఆఫ్రిది, జన విజ్ఞాన వేదిక జిల్లా కార్య వర్గ సభ్యులు దాదాపీర్, ఖాసీమ్ వల్లి, గఫార్ పిలుపునిచ్చారు. శనివారం స్థానిక గ్రంథాలయంలో వారోత్సవాలకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పౌర గ్రంథాలయ శాఖ వారి ఆదేశాల ప్రకారం నవంబర్ నెల 14 నుంచి 20 వరకు నిర్వహిస్తారన్నారు. వారోత్సవాల సందర్భంగా విద్యార్థులకు చిత్ర లేఖనం, వ్యాసరచన, వక్తృత్వ, క్విజ్ తదితర పోటీలు నిర్వహించి బహుమతులు అందజేస్తామన్నారు. పాఠశాలలో లభ్యం కాని పలురకాల పుస్తకాలు గ్రంథాలయంలో విద్యార్థుల కోసం అందుబాటులో ఉంచామన్నారు. కార్యక్రమంలో పాఠకులు లక్ష్మి నారాయణ, రంగ నాయకులు, అలీ బాషా పాల్గొన్నారు.

బిజెపి కనుసన్నల్లో జగన్ ప్రభుత్వం

కడప : బిజెపి కనుసనల్లో జగన్ ప్రభుత్వం నడుస్తుందని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు నజీర్ అహ్మద్ అన్నారు. సంక్షేమంపై అనుమతికై కేంద్రం వద్ద బతిమాలిని దుర్గతి జగన్మోహన్ రెడ్డి ఏర్పడిందని అన్నారు. శనివాయంన ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఈ సంవత్సరం కూడా మన రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్ విజయవాడ ఇందిరాగాంధీ స్టేడియంలో నిర్వహించే కార్యక్రమంలో పాల్గొని ముస్లిం మైనార్టీలకు వరాల జల్లులు కురిపిస్తారు. అవన్నీ నామ్కే వాస్తే అని చెప్పడానికి చాలా ఉదాహరణలు ఉన్నాయి అని తెలిపారు. మైనార్టీలకు ఐదు సంవత్సరాలకు బడ్జెట్‌లో రూ.23 వేల కోట్లు, అందులో పదివేల కోట్లు హౌసింగ్ ప్లాట్ లకు పోగా, ఇక మిగిలిన 13వేల కోట్లు అన్ని పథకాలకు కలిపి కేటాయించింది నిజం కాదా? అని ప్రశ్నించారు. ఉర్దూ భాష అభివృద్ధి కి చేసింది శూన్యమే అన్నారు. ఉర్దూను రెండవ అధికార భాష చేశారే కానీ, అమలు చేశారా, కనీసం మార్గదర్శకాలు పాటించారా అని మండిపడ్డారు. కడపలో హజ్ హౌస్ కు పురోగతి లేదు వాడుకలోకి తీసుకొని రాలేదని విమర్శించారు.

రాష్ట్రంలో అభివృద్ధి శూన్యం : టిడిపి

ప్రజాశక్తి - కడప అర్బన్

– రాష్ట్రంలో అభివృద్ధి శూన్యమని టిడిపి సీనియర్ నాయకులు లక్ష్మిరెడ్డి, కడప నియోజకవర్గ మాజీ ఇన్‌ఛార్జి అమీర్ బాబు, మన్మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం 41 డివిజన్‌లో కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు మరోసారి సీఎం కావడం ఖాయమని పేర్కొన్నారు. పేదల నివసించే రవీంద్ర నగర్ లో మౌలిక వసతులు లేవని విమర్శించారు. వైసిపి నాయకులు ఆస్తులు పెంచుకుంటున్నారని విమర్శించారు. ఆర్టీసీ చార్జీలు పెంచారని చెప్పారు. అనేక రకాల భారాలు ప్రజల నెత్తిన మోపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చెత్త పన్ను వేసిన చెత్త ప్రభుత్వం వైసీపీ అని విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో టిడిపిని గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టిడిపి అధికార ప్రతినిధి ఆమూరి బాలదాసు, ఓబుల్ రెడ్డి, కొండా సుబ్బయ్య, జయ చంద్రారెడ్డి, మేకల వెంకటేష్, నబీకోట శీను, మీనాక్షి, నిర్మల, ఉమాదేవి, మురళి యాదవ్, వీరభద్రయ్య, వెంకటరెడ్డి, రామ సుబ్బారెడ్డి, చెన్నారెడ్డి, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా తోట కృష్ణ

ప్రజాశక్తి - కడప అర్బన్

కాపు, తెలగ, బలిజ, ఒంటరి కులాల ఐక్యసంఘటన రాయల్ కాపునాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా తోట కృష్ణ (ఎన్ఆర్ఐ)ను నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షులు వీరాంజనేయులు నియామక పత్రం అందజేశారు. కడప అసెంబ్లీ పరిధిలోని రాయల్ కాపునాడు అధ్యక్షులుగా అబ్బిశెట్టి వెంకటేశ్వర్లు కు నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు స్పందిస్తూ బాధ్యతలను సక్రమంగా నిర్వహిస్తామని పేర్కొన్నారు.

తోట కృష్ణ   వెంకటేశ్వర్లు

ప్రజా రక్షణభేరి సభను జయప్రదం చేయాలి

ఒంటిమిట్ట : ఈనెల 15న విజయవాడలో నిర్వహించబోయే ప్రజారక్షణభేరి సభను జయప్రదం చేయాలని సిపిఎం మండల నాయకులు కోనేటి నరసయ్య, సి. రాము, ఈశ్వరమ్మ కోరారు. శనివారం వారు సభకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగాద వారు మాట్లాడుతూ రాష్ట్రాన్ని విడగొట్టి పదేళ్లయినా ప్రత్యేక హోదా రాలేదని పేర్కొన్నారు. కడప ఉక్కు ఫ్యాక్టరీ, రామయ్యపట్నం మేజర్ పోర్టు, రాజధాని నిర్మాణం,రాయలసీమ, ఉత్తరాంధ్ర ప్రాంతాలకు ప్రత్యేక ప్యాకేజీ, కేంద్ర విద్యా సంస్థలు ఏర్పాటు, కడప ఉక్కు రైల్వే జోన్ వంటి విభజన హామీలల్లో ఏ ఒక్కటే అమలు కాలేదు. బిజెపి పాలనలో మొత్తం దేశమే అస్తవ్యస్తంగాతయారైందని పేర్కొన్నారు. కార్యక్రమంలో సిపిఎం కార్యకర్తలు పాల్గొన్నారు.

పీస్ స్కూల్‌లో ఆటల పోటీలు

ప్రజాశక్తి - కడప అర్బన్

నగరంలోని పీస్ ఇస్లామిక్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో శనివారం విద్యార్థులకు మ్యూజికల్ చైర్స్, కబడ్డీ, పరుగు పందెం, లెమన్ అండ్ స్పూన్, థ్రెడ్ అండ్ నీడిల్, ఆటల పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతి ప్రదానం చేశారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ గౌస్ పీర్ మాట్లాడుతూ విద్యార్థుల ప్రతిభను గుర్తించి స్కూల్ లో విశాలమైన ఆట స్థలం ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. విద్యతోపాటు ఆటపాటలలో ప్రావీణ్యం పొందేందుకు శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థికి బహుమతి అందజేస్తున్న ప్రిన్సిపల్

జర్నలిస్టుల ఇంటి స్థలాలకు ఇన్ని షరతులా?

ప్రజాశక్తి - కడప అర్బన్

రాష్ట్ర ప్రభుత్వం జర్నలిస్టులందరికీ మూడు సెంట్లు ఇంటి స్థలం ఇచ్చేందుకు విధించిన షరతులను సడలించాలని ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి. దస్తగిరి రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం రైతు సంఘం జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జర్నలిస్టుల అందరికీ ఇంటి స్థలాలు అని ప్రభుత్వం ప్రకటించిన ఆశలన్నీ నీరుగారిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. జర్నలిస్టుల భార్యల పేరు మీద ఎలాంటి ఆస్తిపాస్తులు ఉండకూడదని, చివరకు తల్లిదండ్రులు పసుపు కుంకానికి ఇచ్చిన ఆస్తులు కూడా ఏమీ ఉండకూడదని పెట్టిన నిబంధన తక్షణమే ఉపసంహరించుకోవాలని తెలిపారు. ఇంటి స్థలాల కోసం జర్నలిస్టుల వాటా కింద 40 శాతం మేర డబ్బులు చెల్లించాలని నిబంధనలు పెట్టడం చాలా అన్యాయమని పేర్కొన్నారు. ప్రభుత్వమే జర్నలిస్టులకు ఉచితంగా ఇండ్ల స్థలాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టుల భార్యలు కనీసం చిరు ఉద్యోగులుగా ఉండకూడదని ప్రభుత్వం ప్రకటించిన నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని కోరారు. పత్రిక యాజమాన్యం గుర్తించిన జర్నలిస్టులకు అందరికీ ఇంటి స్థలాలు మంజూరు చేయాలన్నారు. సమావేశంలో ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు గోపాలకృష్ణయ్య పాల్గొన్నారు.

తాగునీటి పనులు వేగవంతం చేయాలి

కడప : కడప నగరానికి సంబంధించి ప్రభుత్వం విడుదల చేసిన జీవో నంబర్ 253 ప్రకారం 1.50 టిఎంసిల నీటిని అమృత్ 2.0 పథకం ద్వారా శ్రీ పోతులూరి వీం బ్రహ్మేంద్రస్వామి రిజర్వాయర్ నుండి కడప నగరానికి తాగునీటి అవసరాలకు కేటాయించారని, అందుకు సంబంధించిన పనులు వేగవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షులు వై విష్ణు ప్రీతం రెడ్డి అన్నారు. శనివారం స్థానిక పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం 2023–24 ఆర్థిక సంవత్సరంలో మళ్లీ రూ.1000 కోట్లు అప్పు తీసుకుంటున్నట్లు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా జారీ చేసిన ప్రకటన ద్వారా తెలుస్తుంది అన్నారు. ఈ అప్పులు రాష్ట్ర బడ్జెట్ పై తీవ్ర ప్రభావం చూపుతాయని పేర్కొన్నారు. ప్రభుత్వం తీసుకున్న అప్పులను ఆర్థిక మంత్రి ద్వారా లేదా సంబంధిత అధికారుల ద్వారా ప్రజలకు వివరించాలని తెలిపారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శులు చీకటి చార్లెస్, వెంకటరమణారెడ్డి, బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కొపూరి శ్రీనివాసులు, నేషనల్ స్టూడెంట్ యూనియన్ ఆఫ్ ఇండియా జిల్లా అధ్యక్షులు మామిళ్ళ బాబు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న విష్ణుప్రీతంరెడ్డి

వృద్ధాశ్రమంలో దీపావళి సంబరాలు

ప్రజాశక్తి - కడప

ఆశా రేఖ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కడప ఇందిరా నగర్ వద్ద ఉన్న పద్మావతి అనాథ వృద్ధాశ్రమంలో దీపావళి పండుగ సందర్భాన్ని పురస్కరించుకొని శనివారం వృద్ధులకు నూతన వస్త్రాలు స్వీట్లు ఫౌండేషన్ వ్యవస్థాపక చైర్మన్ నాగవేణి పంచి పెట్టారు. తమకెవ్వరూ లేరనుకొని దిగులుపడే వృద్ధుల్లో తామున్నామనే భరోసాను కల్పించేలా వారితో సమయాన్ని గడిపి పండుగ ఆనందాన్ని నింపే ప్రయత్నం నాగవేణి చేశారు. ఎంతోమంది దాతల సహకారంతో గత కొన్ని సంవత్సరాలుగా పండుగలకు ఇలాంటి తృప్తినిచ్చే కార్యక్రమాలు చేస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో ఆశారేఖ ఫౌండేషన్ సభ్యులు అబ్దుల్ రాఘవ ఆచారి వాలంటీర్లు పాల్గొన్నారు.

వృద్ధులకు దుస్తులు పంపిణీ చేస్తున్న నాగవేణి

మొక్కుబడే!

ప్రజాదృష్టి

ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి జిల్లా పర్యటన మొక్కుబడిగా సాగింది. పులివెందుల అభివృద్ధి పనుల పరిశీలన, వేముల మండల నాయకులతో సమావేశం, వివాహ కార్యక్రమాల హాజరుకే పరిమితమయ్యారు. జిల్లా ఎదుర్కొంటున్న తీవ్ర కరువు పరిస్థితులపై నెలకొన్న ఆందోళనల్ని విస్మరించి, వ్యక్తిగత ఎజెండాకు పరిమితం కావడం విమర్శలకు ఆస్కారాన్ని కలిగించింది. రాష్ట్ర వ్యాప్తంగా 330 మండలాల్లో కరువు విలయతాండవం చేస్తోందని, ఇందులో 103 మండలాలను మాత్రమే కరువు ప్రాంతాలుగా గుర్తిం చడమేమిటనే విమర్శల వర్షం కురుస్తోంది. ఇటువంటి పరిస్థితుల నేపథ్యంలో ముఖ్యమంత్రి తన సొంత జిల్లా కరువు మండలాల గుర్తింపునకు నోచుకోలేదు. ముఖ్యమంత్రి జిల్లా పర్యటన సందర్భంగా కరువు పరిస్థితులను పరిశీలిస్తారని ఆశించిన రైతాంగానికి నిరాశే మిగిలింది. జిల్లాలో ఒక వైపు కరువు పరిస్థితులు, మరోవైపు పారిశ్రామిక అభివృద్ధి మందగించిన నేపథ్యంలో తీవ్రఅనిశ్చిత పరిస్థితులు ఎదుర్కొంటున్న అరుదైన సమయంలో నిరుత్సాహపూరిత పర్యటన సాగించడం నిరుత్సాహాన్ని కలిగించింది. కడప, అన్నమయ్య జిల్లా అధికార యంత్రాంగాలు కడప జిల్లాలో 17, అన్నమయ్య జిల్లాలో 23 మండలాల్లో కరువు నెలకొందని ప్రతిపాదనలు పంపిన తెలిసిందే. దీనికి కొర్రీలు వేయడం అభ్యంతరకరం. కరువు మండలాల గుర్తించకపోవడానికి ప్రత్యామ్నాయంగా ఏమిచేయాలనే అంశంపై సమాలోచనలు సైతం సాగించకపోవడం అయోమయాన్ని కలిగించింది. రైతు ప్రభుత్వమని ఢంకా భజాయించుకునే పాలకులు రైతును నిర్లక్ష్యం చేయడం తగనిపని. ఇదేతరహాలో ఫిబ్రవరిలో జిల్లాలోని జమ్మలమడుగులోని సున్నపురాళ్లపల్లి దగ్గర ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకు శిలాఫలకం ఏర్పాటు చేసి వెళ్లిపోయారు. కడప జిల్లా ప్రగతి రూపు రేఖలను తీర్చిదిద్దగల ఉక్కు పరిశ్రమ అభివృద్ధి పనుల్ని పరిశీలించి ఉంటే బాగుండేది. ఇటువంటి శాశ్వతమైన అభివృద్ధి పనుల్ని విస్మరించి, అనుత్పాదక పనులైన భవన నిర్మాణాలు, దేవాలయాల పరిశీలన, ప్రారంభోత్సవాలకు పరిమితం కావడం ఆందోళనకరం. శాశ్వత అభివృద్ధి పనుల్ని చేపట్టి వాటి ఫలితాలను సమాజానికి అందించే ప్రయత్నం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. కొప్పర్తి పారిశ్రామికవాడను దశాబ్దాల తరబడి పీడిస్తున్న ఎన్విరాన్‌మెంటల్ అనుమతి, బ్రహ్మసాగర్ నుంచి పరిశ్రమను నీటి సదుపాయాల పనుల పురోగతిని పరిశీలించాల్సి ఉంది. ఇటువంటి శాశ్వత అభివృద్ధి పనుల్ని పరిశీలించకుండా, అనుత్పాదక పనుల పరిశీలన కారణంగా దార్శనికత లోపించిందనే చెప్పాలి. 2021 నవంబర్‌లో దెబ్బతిన్న అన్నమయ్య రిజర్వాయర్ పనుల్ని పరిశీలించి ఉంటే లోతట్టు గ్రామాల ప్రజల్లో ఆదరణ లభించి ఉండేది. జిల్లాలోని కరువు పరిస్థితుల పరిశీలన, వరద పాలైన సాగునీటి ప్రాజెక్టులు, ఉత్పాదక వ్యయంతో కూడిన ఉక్కు పరిశ్రమ, పారిశ్రామికాభివృద్ధికి ఇరుసుగా పేరొందిన కొప్పర్తి పారిశ్రామికవాడ మౌలిక సదుపాయాలను పరిశీలించి, వాటి పునరుద్ధరణ, ఎదురవుతున్న సమస్యల పరిష్కారానికి చొరవ చూపి ఉంటే బాగుండేది. ఇటువంటి దూరదృష్టితో కూడిన పర్యటన చేపట్టి ఉంటే భవిష్యత్ తరాలకు మేలు చేసినట్లు అయ్యేది. జిజిహెచ్ సూపర్‌స్పె షాలిటీ, ఆర్కిటెక్షర్ యూనివర్శిటీ అభివృద్ధి పనుల పరిశీలన చేపట్టాల్సిన అవసరం ఉండేది. ఇటువంటి శాశ్వత అభివృద్ధి పనుల్ని విస్మరించి, అనుత్పాదక వ్యయాలను పరిశీలన చేయడం వల్ల ఎటు వంటి ప్రయోజనమూ ఉండదని గ్రహించాల్సిన అవసరం ఎంతైనా ఉందని చెప్పవచ్చు.

- ప్రజాశక్తి - కడప ప్రతినిధి

టపాసుల దుకాణాల తనిఖీ

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

దుకాణాలను తనిఖీ చేస్తున్న సిఐ, ఎస్ఐ ప్రవీణ్‌కుమార్

దీపావళి సందర్భంగా పట్టణ, మండల పరిధిలో ఏర్పాటు చేసిన టపాసుల దుకాణాలను అర్బన్ సిఐ ఈశ్వరయ్య, ఎస్ఐ ప్రవీణ్ కుమార్, తూనికలు, కొలతల శాఖ సిఐ రమేష్ కుమార్‌రెడ్డి, ఎస్ఐ ఎర్రి స్వామి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ ప్రతి దుకాణంలో నీరు, ఇసుక, నైట్రోజెన్ సిలిండర్లు తప్పక ఉంచుకోవాలని సూచించారు. దుకాణాల పరిసరాల్లో టపాసులు పేల్చరాదని, వ్యర్థాలను కాల్చరాదని సూచించారు. తూనికలు, కొలతల అధికారులు ఎంఆర్‌పి బోర్డులు, తయారీ డేట్, కంపెనీలేని టపాసుల విక్రయ దుకాణాలకు రూ.1000 జరిమానాలు విధించారు. కానిస్టేబుల్ గంగాధర్‌రెడ్డి, ఎస్‌బి కానిస్టేబుల్ విజయేంద్రరెడ్డి పాల్గొన్నారు.

టపాసుల విక్రయ కేంద్రాలపై చర్యలు తీసుకోవాలి : డివైఎఫ్ఐ

జమ్మలమడుగు రూరల్ : టపాసుల విక్రయ కేంద్రాలపై చర్యలు తీసుకోవాలని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరనాల శివకుమార్ శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. పట్టణంలో స్థానిక బాలికల జూనియర్ కాలేజి ఎదురుగా విక్రయిస్తున్నారన్నారు. పేద, మధ్య తరగతి కుటుంబాల ప్రజలు పిల్లల కోసం టపాసులు కొందామని వెళితే ధరలు ఆకాశాన్ని అంటేలా ఉన్నాయన్నారు. ఈ సంవత్సరం ధరలు విపరీతంగా పెంచారన్నారు. నాసిరకం టపాసులు అమ్ముతున్నారని ఆరోపించారు. అధిక ధరలు పెట్టి టపాసులు కొంటే అవి సరిగ్గా మండడం, పేలడం లేదన్నారు. టపాసులు తుస్సుమంటున్నాయన్నారు. వాణిజ్య కేంద్రాల అధికారులు తక్షణమే కడపలో మాదిరిగా జమ్మలమడుగు పట్టణంలో కూడా దాడులు నిర్వహించాలన్నారు. తమపై ఎవరూ చర్యలు తీసుకోరు అనే ధీమాతో వ్యాపారులు ఉన్నారన్నారు. అధిక ధరలు విక్రయిస్తున్న టపాసు కేంద్రాలపై అధికారులు దాడులు నిర్వహించి చర్యలు చేపట్టాలని కోరుతున్నామన్నారు.

గండిక్షేత్రానికి పాదయాత్ర

ప్రజాశక్తి - వేంపల్లె

అయ్యప్ప స్వాములు వేంపల్లె నుంచి గండిక్షేత్రం వరకు పాదయాత్ర చేశారు. శనివారం రామ్మోహన్ గురుస్వామి ఆధ్వర్యంలో అయ్యప్ప స్వాములు అందరూ గండి వీరాంజనేయ స్వామి దేవస్థానం వరకు అయ్యప్ప నామస్మరణతో పాదయాత్ర చేపట్టారు. కార్యక్రమంలో ధ్రువకుమారెడ్డి, సుబ్బారెడ్డి, ఆర్‌కె బద్రీ, జయరామిరెడ్డి, మోహన్‌రెడ్డి, మధురెడ్డి పాల్గొన్నారు.

2024లో టిడిపిదే అధికారం

- రాష్ట్ర మహిళా కమిటీ సభ్యులు ఓబినేని సుబ్బమ్మ

ప్రజాశక్తి -ఒంటిమిట్ట

2024లో టిడిపి అత్యధిక స్థానాలు గెలుచుకొని ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని రాష్ట్ర మహిళ కమిటీ సభ్యులు ఒబినేని సుబ్బమ్మ ధీమా వ్యక్తం చేశారు. గురువారం ఆమె విలేకర్లతో మాట్లాడుతూ తాను 2014లో ఒంటిమిట్ట ఎంపిటిసిగా టిడిపి అభ్యర్థిగా పోటీ చేసి అత్యధిక మెజార్టీతో గెలిచానని చెప్పారు. అప్పటి నుంచి పార్టీలో కొనసాగుతూ పార్టీలో కొనసాగుతూ- మండలం నుంచి నియోజకవర్గ స్థాయికి ఇప్పుడు రాష్ట్ర స్థాయికి చేరుకున్నానని తెలిపారు. బత్యాల చెంగల్‌రాయుడుకు ముఖ్య అనుచరాలుగా కొన సాగుతన్నానని, యాదవ్ సామాజిక వర్గానికి తన వంతు సహాయ సహకరాలు అందిస్తున్నానని చెప్పారు. రాష్ట్రంలో రాక్షస పాలన సాగుతోందన్నారు. జగన్ ప్రస్థానంలో మహిళలకు చోటు లేదని అన్నారు 40 సంవత్సరాల రాజకీయ జీవితంలో ఎలాంటి అవినీతి ఎరుగని మార్చలేని రాజకీయ నాయకుడిగా ఎదిగిన చంద్రబాబు నాయుడిని 53 రోజులు జైల్లో పెట్టించిన ఘనత ఈ జగన్ ప్రభుత్వానికే దక్కిందని పేర్కొన్నారు. ప్రజా వ్యవస్థలను తప్పుదోవ పట్టించి తన పాపం కడుక్కుం టున్నాడని, ఇది చాలా నీచమైన చర్య అని వాపోయారు. ఏ ప్రభుత్వమైనా ప్రశ్నించే హక్కు ప్రతిపక్షాలు ఉంటుందని అది రాజ్యాంగం కల్పించిన హక్కు అన్నారు. ప్రశ్నించిన ఎమ్మెల్యేలను మండల స్థాయి నాయకులను కూడా జైల్లో పెట్టించి అధికార దుర్వినియోగం చేసి జగన్ సంబరపడుతున్నాడని పేర్కొన్నారు. అది ఎంతో కాలం నిలువదని, వైసిపి ప్రభుత్వం గల్లంతయ్యే రోజులు దగ్గరలోనే ఉన్నాయని పేర్కొన్నారు. బత్యాల చెంగ్రలాయుడు రాజంపేట నియోజకవర్గం నుంచి టిడిపి తరపున అభ్యర్థిగా పోటీ చేసి గెలుస్తారని అన్నారు. ఇది నిజ వర్గ ప్రజలకు అందరికి శుభపరుణామం అని పేర్కొన్నారు.

అమృత్‌నగర్‌లో టిడిపి శ్రేణుల పర్యటన

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

ప్రొద్దుటూరు రూరల్ మండలం అమృత్‌నగర్‌లో టిడిపి ఇన్‌ఛార్జి డాక్టర్ జి.వి.ప్రవీణ్‌కుమార్ రెడ్డి ఆదేశాల మేరకు శనివారం బాబు ష్యూరిటీ- భవిష్యతు గ్యారెంటీ కార్యక్రమాన్ని ఆయన భార్య మౌనిక, అక్క హరిత నిర్వహించారు. ఈ సందర్భంగా వారు టిడిపి ప్రకటించిన పథకాలను ఇంటింటికి తిరిగి ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో ప్రొద్దుటూరు రూలర్ మండల కన్వీనర్ బోడెల బాబుల్ రెడ్డి, రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి తాటి శ్రీనివాసుల యాదవ్, ప్రొద్దుటూరు పట్టణ మహిళా అధ్యక్షురాలు భోగాల లక్ష్మీనారాయణమ్మ, పాల సుబ్బరాయుడు, ఫక్రుద్దీన్, ఆర్ఎంపి ప్రసాద్, బోనం శ్రీను, జాఫర్, సాయి, భానుమతి, దేవి, హుస్సేన్ పీర్, చిన్న, కడప పార్లమెంట్ అధికార ప్రతినిధి ఆవులు దస్తగిరయ్య పాల్గొన్నారు.

అనాథలకు దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి - చాపాడు

మైదుకూరు టిడిపి ఇన్‌ఛార్జి పుట్టా సుధాకర్ యాదవ్ తనయుడు, టిడిపి నరసరావుపేట ఎంపీ అభ్యర్థి పుట్టా మహేష్ యాదవ్ జన్మదినం సందర్భంగా కెవెస్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం రోడ్లపై ఉన్న అనాథలు, అభాగ్యులకు దుప్పట్ల పంపిణీ చేశారు. కేక్ కటింగ్ చేసి పంపిణీ చేశారు. చలికాలం దృష్టిలో పెట్టుకొని కొంతమందికైనా సాయం చేయాలనే ఆలోచనతో దుప్పట్లు పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ చైర్మన్ కదిరి సంజీవ రాయుడు యాదవ్ పాల్గొన్నారు.

వృద్ధులకు పండ్లు...

చాపాడు మండలం అవధూత కాశినాయన స్వామి అనాథాశ్రమంలో పుట్టా సుధాకర్ యాదవ్ తనయుడు పుట్టా మహేష్ కుమార్ పుట్టిన రోజు సందర్భంగా శనివారం పండ్లు, బ్రెడ్, కేక్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో రవిశంకర్‌రెడ్డి, బుర్రి నాగరాజు, కిరణ్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, నారాయణరెడ్డి, మండల నాయకులు పాల్గొన్నారు.

వృద్ధులకు పండ్లు పంపిణీ చేస్తున్న టిడిపి నాయకులు

మైదుకూరులో.. పుట్టా మహేష్ యాదవ్‌కు జన్మదినశుభాకాంక్షలు తెలియజేస్తూ వెంకటసుబ్బయ్య చెంచుకాలనీలో కొండపల్లి ఉమాకాంత్ బ్రదర్స్ చీరెలు పంపిణీ చేశారు. గుత్తి నారాయణ యాదవ్, బద్రిపల్లె సర్పంచ్ మల్లేశ్వరి భోజనం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆకుల కృష్ణయ్య, రమేష్, వీరారాజు, పెరుగు కృష్ణయ్య , భూమాయపల్లి సర్పంచ్ వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

కారులో మంటలు.. తప్పిన ప్రమాదం

ఎర్రగుంట్ల : కలమల్ల వద్ద ప్రమాదవశాత్తూ కారులో మంటలు చెలరేగి దగ్ధమైంది. వివ రాల్లోకి వెళితే.. కలమల్లకు చెందిన సత్య నారా యణరెడ్డి తన భార్యను తాడిపత్రిలోని బంధువుల ఇంటి వద్ద వదులుటకు వెళుతుండగా, కలమల్ల-సున్నపురాళ్లపల్లె మార్గ మధ్యంలో కారు ఇంజన్‌లో నుండి పొగలు వచ్చాయి. భయంతో కారులోని ఇరువురు దిగి దూరంగా వెళ్లిపోయారు. కొద్దిసేపటికి కారు మొత్తం మంటలు వ్యాపించి పూర్తిగా కాలి పోయింది. భార్యభర్తలకు ప్రమాదం తప్పింది. ఫైర్ సిబ్బంది మంటలను అదుపు చేశారు. షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు వ్యాపించాయని కారు యజమాని తెలిపారు.

కన్నీరు తెప్పిస్తున్న ఉల్లి ధరలు

ప్రజాశక్తి - బ్రహ్మంగారిమఠం

రోజు, రోజుకూ ఉల్లిగడల ధరలు పెరుగుతుండడంతో సామాన్యుడికి వాటిని కొనకుండానే కన్నీరు తెప్పిస్తున్నాయి. నెల రోజుల నుంచి ఉల్లి ధరలు పైపైకి పోతూనే ఉన్నాయి. డిమాండ్ స్థాయిలో లభ్యత లేక పోవడం, తగినంతగా వర్షాలు కురవకపోవడంతో ఉల్లి సాగు తగ్గి.. దిగుబడి పడిపోయింది. గత ఏడాది అక్టోబర్‌లో కిలో ఉల్లి ధర రూ.10 నుంచి రూ.15 మధ్యలో ఉండేది. గిట్టుబాటు ధర రావడం లేదని చాలా మంది రైతులు సాగు చేయక పోవడంతో ఉల్లి సాగు గణనీయంగా పడిపోయింది. ప్రస్తుతం ఉల్లి ధరలు పెరుగుతున్నాయి. 2018లో ఉల్లి ధర రూ.75 నుంచి రూ.80 వరకు పెరిగింది. మళ్లీ ఇప్పుడు కూడా అదే పరిస్థితి నెలకొంది. మరో వైపు ధర ఎంతైనా ప్రతి వంటలో ఉల్లిగడ్డ పడితే కానీ కుదరని పరిస్థితి. ఈ మధ్య కాలంలోనే టమోటా ధరలు విపరీతంగా పెరిగి సామాన్య ప్రజలను ఉక్కిరి బిక్కిరి చేస్తున్నాయి. ఇప్పుడు ఉల్లి ధరలది కూడా అదే పరిస్థితి. మార్కెట్‌లో ఉల్లిధర రూ.70కి చేరింది. రోజురోజుకూ ఉల్లి ధరలు పెరుగుతుండంతో పేద, మధ్య తరగతి ప్రజలు కొనుగోలు చేసే పరిస్థితి లేదు. ఉల్లి లేకుండా వంటలను చేయాలంటే ఇబ్బందులు పడుతున్నామని గృహిణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఉల్లి ధరలను తగ్గించాలని ప్రజలు కోరుతున్నారు.

పంటల బీమా మంజూరు చేయాలని వినతి

ప్రజాశక్తి - వేంపల్లె

సిఎం జగన్‌కు వినతిపత్రం అందజేస్తున్న చంద్ర ఓబుల్‌రెడ్డి

ఖరీఫ్, రబీ సీజన్ పంటల బీమా మంజూరు చేయాలని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని వైసిపి మండల కన్వీనర్ చంద్రఓబుల్‌రెడ్డి కోరారు. ఆమేరకు చంద్ర ఓబుల్‌రెడ్డి ఇడుపులపాయలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ ఏడాది తీవ్ర వర్షాభావం నెలకొందన్నారు. ఈ నేపథ్యంలో ఖరీఫ్‌లో వేసిన పత్తి పంట సరైన దిగుబడి రాలేదన్నారు. రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. అలాగే రబీ సీజన్‌లో వర్షాల్లేక పండించిన పత్తి, పెసర, ఉద్ది పంటలతోపాటు ఆయా పంటలు ఎండిపోయి రైతులు తీవ్రంగా నష్టపోయారని వివరించారు. పంటలు నష్టపోయిన రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ, వాటికి సంబంధించిన ఇన్సూరెన్స్ మంజూరు చేయాలని ముఖ్యమంత్రిని కోరారు. గతేడాది 2022లో పత్తి పంటకు ఇన్సూరెన్స్ మంజూరైందని, కాని వేంపల్లె మండలంలోని దాదాపు 120 మంది రైతులకు పత్తితోపాటు ఉల్లి పంటల ఇన్సూరెన్స్ రాలేదన్నారు. వాటిని కూడా మంజూరు చేసి రైతులను ఆదుకోవాలని సిఎంను కోరారు. ఇందుకు సిఎం స్పందించి డిసెంబర్ నెలాఖరు నాటికి ఇన్‌పుట్ సబ్సిడీ మంజూరు చేస్తామని హామీ ఇచ్చినట్లు చంద్ర ఓబుల్‌రెడ్డి తెలిపారు. ఖరీఫ్, రబీ సీజన్‌లో సాగు చేసిన పత్తి, పెసర, ఉద్ది పంటలకు వచ్చే ఏడాది ఇన్సూరెన్స్ మంజూరు చేస్తామని సిఎం హామీ ఇచ్చారని తెలిపారు.

బోధన పరికరాలపై అవగాహన

అవగాహన కల్పిస్తున్న సైన్స్ ఉపాధ్యాయులు, విద్యార్థులు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

సివి రామన్ సైన్సు క్లబ్ అధ్వర్యంలో సైన్స్ ఉపాధ్యాయులకు బోధనాపరికరాలపై అవగాహన కల్పిచారు. స్థానిక వైవిఎస్ మున్సిపల్ బాలికల ఉన్నత పాఠశాల హైస్కూల్‌లో శనివారం ప్రొద్దుటూరు డివిజన్ ఉపాధ్యాయులకు విషయ నిపుణులు నరేష్ వివిధ రకాల ప్రయోగాల, పరికరాల ద్వారా అవగాహన కల్పించారు. కార్యక్రమం సైన్స్ క్లబ్ జిల్లా కన్వీనర్ విజయమోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన పాఠ్యాంశాలను సులభతరంగా బోధించే దానికి ఈ కార్యక్రమం చాలా ఉపయోగపడుతుందన్నారు. క్లబ్ సెక్రటరీ కె.చంద్రశేఖర్ మాట్లాడుతూ సివి రామన్ సైన్స్‌క్లబ్ తరపున సైన్స్ టూర్, సైన్స్ ఉపాధ్యాయులకు ప్రతి రెండవ శనివారం వివిధ సైన్సు అంశాల మీద అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి క్లబ్ సలహాదారులు ప్రధానోపాధ్యాయులు రవిప్రకాష్, గోపీనాథ్‌రెడ్డి, జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షులు శ్రీరాములు, కాశీ ప్రసాద్‌రెడ్డి, వివిధ పాఠశాల సైన్స్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అబుల్ కలాం ఆజాద్ గొప్ప దేశభక్తుడు

ప్రజాశక్తి - వేంపల్లె

నివాళులర్పిస్తున్న తులసిరెడ్డి, కాంగ్రెస్ నాయకులు

మౌలానా అబుల్ కలాం ఆజాద్ గొప్ప దేశభక్తుడు, స్వాతంత్ర్య సమర యోధుడని పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి అన్నారు. శనివారం స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటం వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా తులసిరెడ్డి మాట్లాడుతూ 1940-1946 వరకు ఆరేళ్లపాటు కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షులుగా, 1947-1958 వరకు 11 ఏళ్ల పాటు తొలి కేంద్ర విద్యాశాఖ మంత్రిగా మౌలానా అబుల్ కలాం ఆజాద్ ఉన్నట్లు తెలిపారు. భారతరత్న బిరుదాంకితుడుగా పేరు గాంచినట్లు చెప్పారు. మౌలానా ఆజాద్ జయంతిని జాతీయ విద్యా దినంగా భారత ప్రభుత్వం ప్రకటించడం హర్షణీయమన్నారు. కాంగ్రెస్ నాయకులు నరసింహరెడ్డి, అమర్నాథరెడ్డి, ఉత్తన్న, వినయ్, బాలం సుబ్బ రాయుడు, వేమయ్య, రాఘవయ్య, సుబ్రమణ్యం, ధృవకుమార్‌రెడ్డి, వెంకట్ పాల్గొన్నారు.

నిరాశపరిచిన సిఎం పర్యటన

జిల్లాలో రెండు రోజులపాటు చేపట్టిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పర్యటన జిల్లా ప్రజలను నిరాశకు గురి చేసిందని పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి అన్నారు. శనివారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ సిఎం జగన్ రాకతో జిల్లాలో కరువు పరిస్థితిపై సమీక్షించి కరువు మండలాలను ప్రకటిస్తారని ప్రజలు ఎంతో ఆశించారని తెలిపారు. ఎంకి పెళ్లి సుబ్బి చావుకు వచ్చినట్లుంది సిఎం పర్యటన అన్నారు. ప్రయాణికులు, ప్రజలు, డ్వాక్రా మహిళలు, విద్యార్థులు తీవ్ర అసౌకర్యానికి గురైయ్యారని తెలిపారు. జిల్లా ప్రజలు సిఎం పర్యటన వద్దు బాబోయ్ అంటున్నారని తెలిపారు. పుల్లన్న పులివెందుల సంతకు పోనూపోయాడు.. రానూ వచ్చాడు.. వట్టి చేతులతో అన్నట్లుంది జగనన్న పర్యటన అని తులసిరెడ్డి ఎద్దేవా చేశారు.

అబుల్ కలాం జీవితం ఆదర్శవంతం

ప్రొద్దుటూరు : భారతదేశ తొలి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్‌కలాం ఆజాద్ జీవితం ఆదర్శవంతమని పలువురు కొనియాడారు. విద్యాదినోత్సవం సందర్భంగా శనివారం స్థానిక శ్రీనివాస నగర్‌లోని రేడియన్స్ పాఠశాలలో అబుల్‌కలాం జయంతి ఉత్సవాలను మూవ్‌మెంట్ ఫర్ పీస్ అండ్ జస్టిస్ (యంపిజె) ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కలాం జీవితచరిత్రపై వ్యాసరచన పోటీలు నిర్వహించి, గెలిచిన విద్యార్థులకు మొదటి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా యంపిజె రాష్ట్ర కార్యదర్శి సలీం మాట్లాడుతూ నేటి విద్యార్థులు రేపటి విద్యాధికులై మరో అబుల్ కలాంలా ఎదగాలని అకాంక్షించారు. జిల్లా ఆధ్యక్షుడు జాకీర్‌ఉమ్రి మాట్లాడుతూ దేశంలో హిందూ ముస్లింల మధ్య ఐక్యతకు విశేషకృషి చేశారన్నారు. నేడు అగ్రగామిగా వెలుగొందుతున్న అకడమిక్ సాంకేతిక విద్యాసంస్థలకు మౌలానా అజాద్ పునాదులు వేశారన్నారు.

బస్సు సర్వీసులను పునరుద్ధరించాలి

డిఎంకు వినతిపత్రం సమర్పిస్తున్న శివకుమార్

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

పులివెందుల, చాగలమర్రి, శ్రీశైలం వంటి ప్రాంతాల బస్సు సర్వీసులను పునరుద్ధరించాలని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరణాల శివనారాయణ, గండికోట చారిటబుల్ ట్రస్టు చైర్మన్, ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత వై.చంద్రశేఖర్‌రెడ్డి కోరారు. ఆయా ప్రాంతాలకు బస్సులను నడపాలని డిపో మేనేజర్‌కు శనివారం వారు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కరోనా రాక మునుపు జమ్మలమడుగు నుంచి పైన పేర్కొన్న ప్రాంతాలకు బస్సు సర్వీసులు ఉండేవన్నారు. కరోనా తర్వాత అనేక సమస్యలను చెబుతూ తొలగించడం సరైంది కాదన్నారు. జమ్మలమడుగు నుండి శ్రీశైలం, చాగలమర్రి ప్రాంతాలకు వెళ్లాలంటే ప్రొద్దుటూరు నుంచి వెళ్లాల్సి ఉందన్నారు. ఇది ప్రయాణికులకు ఆర్థికభారంతోపాటు సమయం వృథా అవుతోందని వివరించారు. జమ్మలమడుగు నుండి పులివెందులకు వెళ్లాలంటే నేరుగా బస్సులేకపోవడం వల్ల ముద్దనూరు దిగి వెళ్లాల్సి ఉందన్నారు. రైలు సర్వీసులు కడప-గుంటూరు, ధర్మవరం ఎక్స్‌ప్రెస్, నంద్యాల డెమో రైలు వంటివి జమ్మలమడుగులో స్టాపింగ్ ఉందని, ప్రజలు టౌన్‌లోకి రావాలన్నా, టౌన్ నుండి రైల్వేస్టేషన్‌కు వెళ్లాలన్నా రవాణా ఖర్చులు అవుతున్నాయని పేర్కొన్నారు. రైలు ప్రయాణం సమయాల్లో బస్సు సౌకర్యం కల్పిస్తే ఉపయోగకరంగా ఉంటుందని సూచించారు. జమ్మలమడుగు-ప్రొద్దుటూరు నాన్‌స్టాప్ సర్వీసులు ప్రయాణ సమయం సుమారు గంట పడుతోందని విద్యార్థులు, ఉద్యోగస్తులు, ఇతర ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. సమయం కుదించి త్వరగా వెళ్లేలా చూడాలని కోరుతున్నామన్నారు. కార్యక్రమంలో పాముల బ్రహ్మానందరెడ్డి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మల్లు రఘునాథరెడ్డి

ఉపాధ్యాయుల సంక్షేమం పట్టని ప్రభుత్వం

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వ నిరంకుశ వైఖరి మారకపోతే ఉద్యమం చేపట్టక తప్పదని ఎస్‌టియు రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి మల్లు రఘునాథరెడ్డి, జిల్లా అధ్యక్షుడు పి.రమణారెడ్డి పేర్కొన్నారు. పులివెందులలోని రమణప్ప సత్రం(సత్రం బడి) పాఠశాలలో శనివారం రీజనల్ కన్వీనర్ జి.మల్లేష్ అధ్యక్షతన నిర్వహించిన వార్షిక కౌన్సిల్ సమావేశంలో వారు మాట్లాడుతూ.. గతంలో ఎన్నడూలేని విధంగా ఉపాధ్యాయుల పట్ల ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుతో తీవ్ర ఆందోళన, మానసిక వేదనతో బతుకులు వెళ్లదీయాల్సిన దుస్థితి నెలకొందన్నారు. ఇచ్చిన హామీ మేరకు సిపిఎస్‌ను రద్దు చేయకుండా చర్చల పేరుతో కాలయాపన చేసి, తీరా ఎన్నికలు దగ్గర పడుతున్న తరుణంలో ప్రత్యామ్నాయంగా జిపిఎస్‌ను అమలు చేస్తామనడం తగదన్నారు.వెంటనే జిఒ నెంబరు 117ను రద్దు చేయాలన్నారు. అనంతరం జాతీయ విద్యాదినోత్సవం సందర్భంగా మౌలానా ఆజాద్ చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులు అర్పించారు.కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్.దాదాపీర్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు శంకర్‌రెడ్డి, నాగేంద్ర, ఎంఇఒ రామానాయుడు, జిల్లా బాధ్యులు బండి సుధాకర్ రెడ్డి, భాస్కర్‌రెడ్డి, మునిబాబు, సీనియర్ నాయకులు శివరామిరెడ్డి, ప్రసాదరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు శిల్పారామంలో సాంస్కృతిక కార్యక్రమాలు

పులివెందుల టౌన్ : పట్టణ పరిధిలోని శిల్పారామంలో ఆదివారం సాయంత్రం నిర్వహించే సాంస్కృతిక కార్యక్రమాలను విజయవంతం చేయాలని శిల్పారామం పరిపాలన అధికారి సుధాకర్ శనివారం ఒక ప్రకటనలో కోరారు. ఎర్రబెల్లి తండా విద్యార్థులచే క్లాసికల్, జానపద కార్యక్రమాలను ప్రదర్శించనున్నట్లు తెలిపారు.

మాజీ జడ్‌పిటిసిని పరామర్శించిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి - చాపాడు

చాపాడు మాజీ జడ్‌పిటిసి, చియ్యపాడు ఎంపిటిసి ఎస్ఆర్ బాలనరసింహారెడ్డిని మైదుకూరు ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి పరామర్శించారు. బాలనరసింహారెడ్డి ఇటీవల గుండెకు సంబంధించి హైదరాబాద్‌లో చికిత్స చేయించుకొని ఇంటికి చేరుకున్నారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే శుక్రవారం రాత్రి పరామర్శించి, ఆరోగ్య వివరాలను అడిగి తెలుసుకున్నారు. జాగ్రత్తలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త ఎస్‌నాగిరెడ్డి, ఎంపిపి టి.లక్షుమయ్య, మండల కన్వీనర్ రాజశేఖర్‌రెడ్డి, గృహసారథుల మండల కన్వీనర్ రామ్మోహన్‌రెడ్డి, వైసిపి నాయకులు జయ సుబ్బారెడ్డి, గ్రామ ఉప సర్పంచ్ ఓబులేసు, అశోక్, జయరామిరెడ్డి, మోహన్‌రెడ్డి, వెంకట సుబ్బారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

ఆదర్శనీయం.. జగన్ పాలన

సర్పంచ్ పెద్దక్క, నాయకులు శ్రీనివాసులు

ప్రజాశక్తి - ముద్దనూరు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన జనరంజకం.. పారదర్శకంగా పథకాలు అమలు చేస్తున్నారని ఆరవేటిపల్లె సర్పంచ్ కత్తెం పెద్దక్క, వైసిపి నాయకులు కత్తెం శ్రీనివాసులు తెలిపారు. 'ప్రజాశక్తి'తో వారు మాట్లాడుతూ రాష్ట్ర, ప్రజల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా సిఎం జగన్ వినూత్న కార్యక్రమాలు చేపట్టి రాష్ట్రాన్ని ఆదర్శంగా నిలబెట్టారన్నారు. ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు అందేలా పాలన సాగిస్తున్నారని కొనియాడారు. ప్రజలకు అండగా నిలుస్తున్నారన్నారు. సిఎం, ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి సహాయ సహకారాలతో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్నారన్నారు. ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటూ.. ప్రభుత్వ పథకాలను చేరువ చేస్తూ.. ప్రజా సమస్యల పరిష్కారానికి పాటుపడుతున్నారని తెలిపారు. ఆరవేటిపల్లె గ్రామ పంచాయతీ అభివృద్ధే లక్ష్యంగా గ్రామాలకు, ప్రజలకు అవసరమైన వసతులు కల్పిస్తున్నట్లు చెప్పారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందేలా పాటుపడుతున్నామన్నారు. ఆరవేటిపల్లె గ్రామ పంచాయతీని ఆదర్శంగా తీర్చిదిద్దుతామన్నారు. అలాగే వైసిపి బలోపేతానికి తమ వంతు నిరంతరం కృషి చేస్తామన్నారు. రానున్న ఎన్నికల్లో వైసిపి విజయానికి పాటుపడతామన్నారు. ప్రజలు తమ విలువైన ఓటును వైసిపికి వేసి అత్యంత భారీ మెజారిటీతో గెలిపించాలని పెద్దక్క, శ్రీనివాసులు కోరారు.

వ్యాపారుల ఆగడాలతో ప్రజలకు ఇబ్బందులు

ప్రజాశక్తి - కొండాపురం

కొండాపురం పట్టణంలో వ్యాపారుల ఆగడాలు రోజురోజుకు ప్రజలకు ఇబ్బందికరంగా మారుతున్నాయి. కొండాపురం పట్టణంలో గుజిరి వ్యాపారం చేసుకునే యజమాని తన వ్యాపార స్వయం ప్రకాశిని రబ్బరు టైర్లుకు నిప్పుపెట్టి, అక్కడికి వచ్చిన కొంత సామానుకు మంట పెట్టి వాతావరణ కాలుష్యం చేస్తున్నారు. ఇలా చేయడం జాతీయ రహదారి పక్కగానే కావడంతో రోడ్డుపై వెళుతున్న పాదచారులు, వాహనదారులు, ఆ ప్రాంతంలో నివసించే వారికి చాలా ఇబ్బందికరంగా మారింది. అంతేకాకుండా చుట్టుపక్కల చికెన్ దుకాణదారులు కూడా కోళ్ల వ్యర్థాలను స్థానిక నివాస గృహాల మధ్య వేస్తున్నారు. వీటి నుంచి వచ్చే కంపును భరించలేకున్నామని, అనేక రోగాల బారినపడుతున్నాయని ప్రజలు వాపోతున్నారు. వీరిపై పంచాయతీ అధికారులు, పోలీసులు కానీ ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో రోజురోజుకూ ఇలాంటివి పెరిగిపోతున్నాయని ప్రజలు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు వీరిపై కేసులు నమోదు చేసి, కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

టైర్లకు నిప్ప పెట్టడంతో కమ్ముకున్న పొగ

విలక్షణ నటుడు చంద్రమోహన్

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

చంద్రమోహన్‌తో జింకా సుబ్రహ్మణ్యం (ఫైల్ ఫొటో)

చిత్రసీమలో 932 చిత్రాలలో నటించిన విలక్షణ నటుడు చంద్రమోహన్ అని, ఆయన లేనిలోటు తీర్చలేనిదని జిల్లా రచయిత సంఘం ప్రధాన కార్యదర్శి జింకా సుబ్రహ్మణ్యం సంతాపం ప్రకటించారు. శనివారం చంద్రమోహన్ మరణవార్త విని దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. రంగులరాట్నం చిత్రంతో రంగప్రవేశం చేసి పదహారేళ్ల వయసు, సిరిసిరిమువ్వ, శుభోదయం, జీవనతరంగాలు, శంకరాభరణం వంటి అనేక చిత్రాల్లో నటించి ప్రేక్షక హృదయాల్లో శాశ్వతస్థానం పొందారన్నారు. 1990, 1994 సంవత్సరాల్లో ప్రొద్దుటూరు రవికళానికేతన్ వార్షికోత్సవాల్లో రెండుసార్లు పాల్గొన్నారని గుర్తు చేశారు. ప్రొద్దుటూరు కళాకారులతో పరిచయం ఉన్నందున కర్నాటకలో షూటింగ్‌కు వెళ్లేటప్పుడు తమల్ని ఎర్రగుంట్ల రైల్వేస్టేషన్‌కు పిలిపించుకొని మాట్లాడారని గుర్తుచేసుకున్నారు. చంద్రమోహన్ మరణం పట్ల సంతాపం ప్రకటిస్తూ ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని జింకా తెలిపారు.

జాబ్‌మేళాలో 22 మంది ఎంపిక

ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్) : స్థానిక రాణీ తిరుమలదేవి డిగ్రీ కళాశాలలో హెటిరో ల్యాబ్స్ వారి ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన జాబ్‌మేళాలో 22మంది ఎంపికయ్యారని ప్రన్సిపల్ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. ఆ ల్యాబ్స్ హెచ్ ఆర్ గొల్లపల్లి సిమాన్, సమీర్ ఇంటర్వ్యూలు నిర్వహించారు. డిగ్రీ, ఎంఎస్సీ, ఫార్మసీ పూర్తయిన 48 మంది హాజరయ్యారన్నారు. తమ కళాశాల నుండి 13 మంది విద్యార్థులు ఎంపి కవ్వడం ఆనం దకరమన్నారు. వీరు ఈనెల 15న జాయిన్ అవ్వాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాం డెంట్ తరుణేందు శేఖర్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ వెంకటేశ్వరరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ఎంపికైనవారితో కళాశాల, కంపెనీ ప్రతినిధులు

ఐడిపిఎస్‌లో వైద్య శిబిరం

చాపాడు : స్థానిక ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్లో శనివారం పాఠశాల బస్సు డ్రైవర్లకు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డ్రైవర్లకు కంటి పరీక్షలు, బిపి, షుగర్ వంటి సమస్యలకు తగు జాగ్రత్తలు తెలిపారు. అవసరమైన వారికి కంటి అద్దాలు, మందులు ఉచితంగా అందజేశారు. పాఠశాల చైర్మన్ డాక్టర్ వి జయచంద్రారెడ్డి, ప్రిన్సిపల్ బి.రవీంద్ర, సిబిఐటి ప్రిన్సిపల్ జి.శ్రీనివాసులరెడ్డి, రోటరీ క్లబ్ కార్యదర్శి గజ్జల వెంక టేశ్వరరెడ్డి, ఎం.సూర్యనారాయణరెడ్డి, కె.రవికుమార్‌రెడ్డి, జి.రామకృష్ణ, రోటరీ క్లబ్ మేనేజర్ అరుణ, వైద్యులు వశిష్ఠ, నరసింహారెడ్డి, చాందిని బేగం పాల్గొన్నారు.

పేదరికంపై గెలవాలంటే విద్య ఒక్కటే మార్గం

ప్రొద్దుటూరు : పేదరికంపై గెలవాలంటే విద్య ఒక్కటే మార్గమని 33వ వార్డు కౌన్సిలర్ గాజుల శివజ్యోతి, కార్మిక నేస్తం సంఘం అధ్యక్షులు కుతుబుద్దీన్ పేర్కొన్నారు. రోజి వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో శనివారం మౌలానా అబుల్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఎస్‌వివి బాలుర ఉన్నత పాఠశాలలో 33వ వార్డు ఉర్దూ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేఈతలకు బహుమతలు అందజేశారు. 34వ వార్డు ఇన్‌ఛార్జి నీలాపురం బాషా, 33వ వార్డు అధ్యక్షులు బేల్దార్ బాషా పాల్గొన్నారు.

మహారాజశ్రీ గౌ॥ ప్రొద్దుటూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

OS No. 533/2020

బోగా బాలవీరయ్య S/o బాలయ్య, వయస్సు: 52 సం॥లు, హిందు, గోల్డ్‌స్మిత్, డి.నెం. 4/468, సూపర్ బజార్ రోడ్డు, ప్రొద్దుటూరు టౌన్, కడప జిల్లా **...వాది**

VA

యల్లపు నాగరాజు S/o మునిరాజు చనిపోయినందున వారసులు
(1) యల్లపు లక్ష్మి W/o యల్లపు నాగరాజు, వయస్సు 25 సం॥లు
(2) యల్లపు సాత్విక్ S/o యల్లపు నాగరాజు, వయస్సు 9 సం॥లు
(3) యల్లపు రిషికౌశిక్ S/o యల్లపు నాగరాజు, వయస్సు 7 సం॥లు
అందరూ కలిసి డో.నెం. 28-173-7, రామేశ్వరము, ప్రొద్దుటూరు టౌన్, కడప జిల్లా. **...ప్రతివాదులు**

దావా సమన్లు

పైన తెలిపిన వాది, ప్రతివాదులు అయిన 1, 2 మరియు 3 అయిన మీపైన పై కోర్టులో దావా దాఖలు చేసిఉన్నారు. సదరు దావాలో మీకు ఏమైనా ఆక్షేపణలు ఉన్నయెడల మీరుగానీ, మీ వకీలుగానీ తేది. 14-11-2023న ఉదయం 10.30 గంటలకు పై కోర్టులో హాజరై ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనియెడల మీకు పరోక్షముగా తీర్మాణించబడును అని ఇందుమూలంగా తెలియజేయడమైనది.

By order of the Court
జి. శ్రీరామచంద్రప్రసాద్
వాది తరపున అడ్వకేట్, ప్రొద్దుటూరు, కడప జిల్లా